సాక్షి
ఖమ్మం
సోమవారం । 20 । జనవరి । 2025



కిటకిటలాడిన బస్టాండ్లు

సంక్రాంతి సెలవులకు సొంత ఊర్లకు వచ్చిన వారు తిరుగు పయనం కావడంతో ఆదివారం పలు బస్టాండ్లు కిటకిటలాడాయి. 8లో



మిర్చి రైతు కంట్లో కన్నీరు

అధిక ధర వస్తుందనే ఉద్దేశంతో గతేడాది పండించిన మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన రైతులకు ఇప్పుడు కన్నీరే మిగులుతోంది. 10లో

గరిష్టం/కనిష్టం
31°/ 17°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

'రైతు భరోసా' భూముల పరిశీలన



వ్యవసాయ యోగ్యం కాని భూములను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు, మహ్మదాపురం గ్రామాల్లో రైతు భరోసాకు ఆమోదయోగ్యం కాని భూముల సర్వే ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు భరోసాలో పంటల సాగుకు అనుకూలం కాని భూములను సక్రమంగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సర్వే వివరాలను తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఏఓ సీతారాం రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలకు అర్హుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సరిత, ఏఈఓ నవనీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్ఓ కళావతిబాయి



వైద్యులతో మాట్లాడుతున్న కళావతిబాయి

మధిర: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతిబాయి అన్నారు. మండల పరిధిలోని దెందుకూరు పీహెచ్‌సీని ఆదివారం ఆమె సందర్శించారు. సిబ్బంది పనితీరు, హాజరు రిజిస్టర్లు, ఓపీ రిజిష్టర్, పీహెచ్‌సీలో సదుపాయాలు, డెలివరీ గది, శానిటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పృథ్వీ రాజ్‌నాయక్, చెరుకూరి దివ్య శృతి, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ లంకా కొండయ్య, హెల్త్ అసిస్టెంట్ గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నేషనల్ మెంటరింగ్ సభ్యుడిగా ప్రభాకర్ రెడ్డి



పెసర ప్రభాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: నూతన విద్యావిధానం -2020 అమలులో భాగంగా జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్సీటీఈ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ మిషన్ ఆన్ మెంటరింగ్ సభ్యుడిగా తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత పెసర ప్రభాకర్‌రెడ్డిని కేంద్ర విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు ఎన్సీటీఈ, ఎన్ఎంఎం కన్వీనర్ దినేశ్ చతుర్వేది నుంచి ఆయనకు మెయిల్ అందింది. ఈ మిషన్‌లో భాగంగా జీవశాస్త్ర బోధనా పద్ధతులు, బోధనలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై వివిధ రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మెంటరింగ్ అనే ప్రక్రియలో తనను భాగస్వామిని చేయడం ఆనందంగా ఉందని అన్నారు. జీవశాస్త్రం బోధనా పద్ధతులు, డిజిటల్ పరిజ్ఞానం, ఉపాధ్యాయుల వృత్తిపర అభివృద్ధి, వారి వ్యక్తిగత నైపుణ్యాలను వృద్ధి చేసేందుకు తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. నేషనల్ మెంటరింగ్ సభ్యుడిగా ఎంపికైన ప్రభాకర్‌రెడ్డిని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం



పిచ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన అండర్-17 బాలికల క్రికెట్ శిక్షణా శిబిరాన్ని ఈనెల 21న ప్రారంభించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడల సంఘం కార్యదర్శి కె.నర్సింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించే ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రికెట్ జట్ల పటిష్టానికి ఈ శిబిరం ఉపకరిస్తుందని పేర్కొన్నారు. శిక్షకులుగా శ్రీనివాస్ వ్యవహరిస్తారని తెలిపారు.

ఆ శాఖ రూటే.. సెపరేటు !



గాడి తప్పుతున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

- చేయి తడిపితే చాలు.. ఎలాగైనా సరే రిజిస్ట్రేషన్లు
- ఒప్పందం కుదరకపోతే మాత్రం ససేమిరా
- శాఖ ఉద్యోగులపై మంత్రి పొంగులేటికి ఫిర్యాదుల వెల్లువ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో కొందరు ఉద్యోగుల తీరు గాడి తప్పుతోంది. కొద్ది కాలంగా పలువురు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. నిబంధనలను పక్కన పెట్టి ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు చేస్తుండడంతో శాఖ పరువు వీధికెక్కుతోంది. గత ఐదేళ్లలో పలువురు సబ్ రిజిస్ట్రార్లు, ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లు మార్గదర్శకాలు, నిబంధనలు పట్టించుకోకుండా ప్రభుత్వ స్థలాలను కూడా రిజిస్ట్రేషన్ చేసేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేయించి.. కొందరిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల కూడా అలాంటి ఘటనలు చోటుచేసుకోవడం, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతుండడంతో మంత్రి ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఆరోపణల వెల్లువ..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఖమ్మంలో ఆర్ఓ కార్యాలయంతో పాటు ఖమ్మం రూరల్, కూసుమంచి, సత్తుపల్లి, వైరా, కల్లూరు, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, బూర్గంపాడులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. వీటిలోని కొన్ని కార్యాలయాల్లో అవకతవకలు, నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా.. సబ్ రిజిస్ట్రార్లు, ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లు మొదలు డాక్యుమెంట్ రైటర్ల వరకు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

గతంలో

ఖమ్మం రూరల్ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన కరుణ నిబంధనలు, మార్గదర్శకాలను పక్కన పెట్టి అక్రమాలకు పాల్పడినట్లు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీకి ఫిర్యాదులు అందాయి. ఆమె ఏదులాపురం రెవెన్యూ 142వ సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారన్న ఫిర్యాదులపై విచారణ చేపట్టగా నిజమేనని తేలడంతో 2021లో సస్పెన్షన్ వేటు వేశారు.

- మధిరలోని సర్వే నంబర్ 6లో ఉన్న 277.77 చదరపు గజాల ఎక్సైజ్ శాఖ కార్యాలయ స్థలాన్ని 2021 మే 11న గిఫ్ట్ సెటిల్‌మెంట్ స్వాధీన దస్తావేజు కింద ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సత్యానందం రిజిస్ట్రేషన్ చేశారు. ఈ ఘటనలో ఆయనను సస్పెండ్ చేశారు. అలాగే, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తిని అరెస్ట్ చేసి డాక్యుమెంట్‌ను రద్దు చేశారు.
- కూసుమంచిలో నిబంధనలకు విరుద్ధంగా వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. 2022లో కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇలా జరిగాయి. అనుమతి లేని వెంచర్ల రిజిస్ట్రేషన్‌కు రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ అభ్యంతరం చెప్పడంతో రెండు రోజులు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన సీనియర్ అసిస్టెంట్ కిరణ్ రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు గుర్తించారు.
- సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో నిషేధిత భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఇంటి నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోనూ డోర్ నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన వైరా సీనియర్ అసిస్టెంట్ ఖదీర్ అవినీతి అక్రమాలకు పాల్పడినట్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆయన హయాంలో డబ్బు వసూలు చేసిన వీడియోలు సంచలనంగా మారాయి. ఆయనే ఇల్లెందు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించినప్పుడు ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. దీంతో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి సరెండర్ చేసి ఆ తర్వాత మరో కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు.
- వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడేళ్లలో నలుగురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. ఇందులో మూడేళ్ల క్రితం సబ్‌రిజిస్ట్రార్ సత్యానందం.. మధిర ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తూ అక్కడి ఎక్సైజ్ శాఖ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి సస్పెన్షన్‌కు గురయ్యాడు. మరో సబ్ రిజిస్ట్రార్ రాంకుమార్ సర్వే నంబర్లు మార్చి ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయడంతో బదిలీ వేటు పడింది. అలాగే, సబ్ రిజిస్ట్రార్ మోహిత్ అలీ రిజిస్ట్రేషన్ విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో బదిలీ చేశారు. ఇక్కడే మహిళా సబ్‌రిజిస్ట్రార్ ఏన్కూరు మండలంలో గిరిజన భూములు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసి బదిలీకి గురయ్యారు. తాజాగా రామచంద్రయ్య నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసి సస్పెన్షన్‌కు గురవడం గమనార్హం. ఇలా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసిన నలుగురు సబ్ రిజిస్ట్రార్లపై మూడేళ్ల కాలంలో చర్యలు తీసుకున్నారు.

ఐదేళ్లలో రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల లీలల్లో కొన్ని..

లింక్ డాక్యుమెంట్లు లేని స్థలాలతో పాటు అనుమతి లేని స్థలాలను రిజిస్ట్రేషన్ చేయొద్దనే నిబంధనలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల నాలా కన్వర్షన్ లేని భూములకు సైతం అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్లు చేసిన వ్యవహారంలో వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్య సస్పెన్షన్‌కు గురయ్యారు.

ప్రక్షాళన చేసినా..

ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ల తీరుపై వచ్చిన విమర్శలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్యోగులు మొదలు సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లను వేర్వేరు జిల్లాలకు బదిలీ చేశారు. అయినా ఖమ్మం జిల్లాకు కొత్తగా వచ్చిన సబ్ రిజిస్ట్రార్ల తీరు మారడం లేదు. ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కావాలనే కొన్ని డాక్యుమెంట్లను పక్కన పెడుతున్నారని, గతంలో రిజిస్ట్రేషన్ చేసిన వెంచర్‌లోనే ఇంకొందరు తమ స్థలాల రిజిస్ట్రేషన్‌కు వెళితే పట్టించుకోవడం లేదంటూ పదుల సంఖ్యలో ఫిర్యాదులు పొంగులేటికి చేరగా.. ఆయన అధికారిణి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఘటనపైనా మంత్రి తీవ్రంగా స్పందించి జిల్లా రిజిస్ట్రార్‌ను మందలించినట్లు సమాచారం.

పారదర్శక పాలన అందిస్తున్నాం

- 'మధిర' ప్రజలు తలెత్తుకుని తిరిగేలా చేస్తా
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



బనిగండ్లపాడులో ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

ఎర్రుపాలెం: ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు దక్కేలా పారదర్శక పాలన అందిస్తామని, గ్రామ సభల్లో చర్చించిన తర్వాతే అర్హుల ఎంపిక జరుగుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని నర్సింహాపురం, బనిగండ్లపాడు, పెద్దగోపవరం, తక్కెళ్లపాడు, సఖినవీడు తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన, బనిగండ్లపాడులో ప్రభుత్వ ఆస్పత్రి భవన ప్రారంభోత్సవం చేశారు. పెద్దగోపవరంలో సొసైటీ గోదాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. మధిర నియోజకవర్గం నుంచి నాలుగు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలిపించిన ప్రజల కోసం నిరంతరం పని చేస్తూ వారి రుణం తీర్చుకుంటున్నట్లు తెలిపారు. ఈ నియోజకవర్గ ప్రజలు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. రాగద్వేషాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి రావాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 26 నుంచి అమలయ్యే నాలుగు సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక పారదర్శకంగా చేస్తామని, గ్రామసభల్లోనే అందరి సమక్షంలోనే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని వివరించారు. అర్హత ఉండి కూడా పేర్లు రాకపోతే గ్రామసభలోనే తిరిగి నమోదు చేస్తామని చెప్పారు. ఎర్రుపాలెం మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు జమలాపురంలో అటవీ పార్కు, బుచ్చిరెడ్డిపాలెం, మామునూరు చెరువులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎర్రుపాలెంలో మరో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, బనిగండ్లపాడులో శిథిలమైన జూనియర్ కళాశాలకు పూర్వ వైభవం తెచ్చేలా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సాగర్ మూడో జోన్‌లో ఉన్న ఎర్రుపాలెం, మధిర మండలాల్లోని టైలాండ్ భూములకు సాగునీరు దక్కేలా రెండో జోన్‌లోకి తీసుకొచ్చామని, త్వరలోనే వాటికి టెండర్లు పిలుస్తామని తెలిపారు. మధిరలో క్షీర విప్లవం తేవడానికి ఇందిరమ్మ డెయిరీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, డీపీఓ ఆశాలత, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ ఉషాశారద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు..

సఖినవీడులో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు, సొసైటీ చైర్మన్ ముల్పూరు శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు భట్టి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యతను చాటుతాయి

- సీపీ సునీల్‌దత్
- జిల్లాస్థాయి పోలీస్ క్రీడాపోటీలు ప్రారంభం



బెలూన్లు ఎగురవేస్తున్న సీపీ సునీల్‌దత్ తదితరులు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీపీ

ఖమ్మం స్పోర్ట్స్ : క్రీడలు ఐక్యతను చాటిచెబుతాయని, ఆటల ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు ప్రతిష్ట పెరుగుతాయని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, శాంతి కపోతాలు ఎగురవేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, పోలీస్ శాఖలో మానసిక వికాసం ముఖ్యమని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులకు ఇలాంటి పోటీలు నూతనోత్సాహాన్ని అందిస్తాయని చెప్పారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రతీ ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఖమ్మం టౌన్, రూరల్, వైరా, కల్లూరు సబ్ డివిజన్ల పోలీస్ సిబ్బంది మొత్తం 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ప్రసాద్‌రావు, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ట్రైనీ ఐపీఎస్ రుత్విక్ సాయి, ఏసీపీలు సాంబరాజు, నర్సయ్య, సుశీల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ భరోసా'కు బాటలు..

- ఉపాధి పనుల ఆధారంగా అర్హుల గుర్తింపు
- జాబ్‌కార్డుల ద్వారా వివరాలు సేకరిస్తున్న అధికారులు
- కూలీల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు
- జిల్లాలో 20 రోజులు పని చేసిన కుటుంబాలు 90 వేలు



జిల్లాలో ఈజీఎస్ జాబ్‌కార్డుల వివరాలు(లక్షల్లో)..

జాబ్ కార్డుల సంఖ్య	3.06
కూలీల సంఖ్య	6.43
యాక్టివ్ జాబ్ కార్డులు	1.82
యాక్టివ్ కూలీలు	3.07

ఖమ్మంమయూరిసెంటర్ : వ్యవసాయ భూమి లేని కూలీలకు ఇందిరమ్మ భరోసా పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. కూలీలకు ఈ పథకం కింద కుటుంబానికి రూ.12 వేలు అందించనుండగా.. అర్హులను గుర్తించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఉపాధి పనులకు వెళ్లే వారికే ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అర్హుల గుర్తింపు ప్రక్రియను ఈజీఎస్ సిబ్బందికి అప్పగించారు. ఇలా సేకరించిన వివరాలను ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఈనెల 26వ తేదీ లోపు అర్హులను గుర్తించడంతో పాటు గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా ప్రకటించి ఆమోదం పొందాల్సి ఉంటుంది. దీంతో క్షేత్ర స్థాయిలో అర్హుల వివరాల సేకరణను వేగవంతం చేశారు.

జాబ్‌కార్డుల ఆధారంగా..

ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగి ఉన్న కుటుంబాల వివరాలను ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ నుంచి రాష్ట్ర అధికారులు సేకరించారు. దీన్ని జిల్లాల వారీగా విభజించి ఆయా జిల్లాల అధికారులకు అందజేశారు. వీటి ఆధారంగా ఖమ్మం జిల్లాలో ఉపాధి పనులకు వెళ్తున్న కూలీల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. 20 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాల్లో భూమి లేని వారి వివరాలను సేకరిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు..

జిల్లాలో ఈజీఎస్ కూలీల ఇళ్లకు వెళ్తున్న అధికారులు.. వారి ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్లు నమోదు చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఈ వివరాలు సేకరించే బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లకు అప్పగించారు. వీరు సేకరించిన సమాచారాన్ని మండల సీఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వీటిని మండల స్థాయిలో ఏపీఓలు పర్యవేక్షిస్తుండగా.. జిల్లా స్థాయిలో ఏపీడీలు, పీడీ పర్యవేక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 90 వేల కుటుంబాలు 20 రోజుల పనిదినాలు పూర్తి చేసినట్టు గుర్తించగా.. వారిలో సుమారు 35 వేల కుటుంబాలకు వ్యవసాయ భూమి లేనట్లు తెలుస్తోంది.

గ్రామ సభల్లో వెల్లడి..

వ్యవసాయ భూమి లేని కూలీల కుటుంబాలను సిబ్బంది గుర్తించిన తర్వాత వారి వివరాలతో కూడిన జాబితాను గ్రామ సభల్లో ప్రజల ముందు వెల్లడించనున్నారు. ఆ తర్వాత అర్హులను ఎంపిక చేస్తామని అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితా పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. గ్రామ సభల్లో అర్హులుగా గుర్తింపు పొందిన వారికి ఇందిరమ్మ భరోసా కింద ఆర్థిక సాయం అందనుంది.

రేపటి నుంచి గ్రామసభలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- అర్హులకు అందనున్న సంక్షేమ పథకాలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్(ఫైల్)

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల సమక్షంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, తదితరుల సహకారంతో ప్రజాపాలన దరఖాస్తులపై సర్వే నిర్వహించారు. సర్వే అనంతరం గ్రామసభల్లో వీటిని ఆమోదించడం ద్వారా అర్హులకు సంక్షేమ పథకాలు అందే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

గ్రామ సభల్లో అర్హుల ఎంపిక..

జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 589 పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, పంచాయతీ ప్రత్యేకాధికారుల సమక్షంలో సభలు జరగనున్నాయి. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో సైతం వార్డు సభలను ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో సమీక్ష నిర్వహించడంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను తహసీల్దార్లు, వ్యవసాయ శాఖాధికారులు పరిశీలన చేయనున్నారు.

అందనున్న పథకాలివే..

సాగుకు యోగ్యమైన భూమికి ఎకరానికి ఏడాదికి రైతు భరోసా కింద రూ.12 వేలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని ఉపాధి కూలీలకు రెండు విడతల్లో ఏడాదికి రూ.12 వేలు అందించనున్నారు. గత సంవత్సరం కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన వారికే ఈ ఇందిరమ్మ భరోసా పథకం వర్తించనుంది. ఇంకా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందనున్నాయి.

నిరంతరం ప్రక్రియ..

ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ అని, పథకం అందలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. సర్వేలో పేర్లు రానివారు తిరిగి గ్రామసభల్లో దరఖాస్తులు సమర్పించుకోవచ్చని చెబుతున్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని భరోసా కల్పిస్తున్నారు.

శ్రీకనక దుర్గమ్మకు విశేష పూజలు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి అర్చకులు ఆదివారం విశేష పూజలు జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజాది కార్యక్రమాలను ఈఓ ఎన్ రజనీకుమారి పర్యవేక్షించారు.

చిత్రకూట మండపంలో రాపత్తు సేవ



శ్రీసీతారామ చంద్రస్వామివారు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో రాపత్తు సేవ నిర్వహించారు. చినజీయర్ మఠం ఆధ్వర్యంలో ఈ వేడుకను కమనీయంగా నిర్వహించారు. పల్లకీలో స్వామివారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హారతిని సమర్పించారు. అనంతరం దేవనాథ రామానుజ జీయర్ స్వామి ప్రవచనాలు చేశారు. కాగా ఈ రాపత్తు ఉత్సవాలు సోమవారంతో ముగుస్తాయి.

రామయ్యకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన

దేవస్థానంలో రామయ్య స్వామి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

క్లుప్తంగా

1989 బ్యాచ్ కానిస్టేబుళ్ల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలో పనిచేసిన 1989 బ్యాచ్ కానిస్టేబుళ్లు ఆదివారం తమ కుటుంబ సభ్యులతో నగరంలో సమ్మేళనం నిర్వహించారు. అదే బ్యాచ్‌లో సీఐగా ఉద్యోగ విరమణ పొందిన శివసాంబిరెడ్డి ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో బ్యాచ్ సభ్యులు శివసాంబిరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, సురేందర్‌రెడ్డి, దస్తగిరి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాసాచారి, సత్యం పాల్గొన్నారు.

సైబర్ మోసం

వేంసూరు: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నగదు పోగొట్టుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వీరప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని చౌడవరంతండాకు చెందిన భూక్యా తిరుపతిరావు ఫోన్‌లో తెలియని యాప్ ఇన్‌స్టాల్ అయింది. అతడికి తెలియకుండానే రూ.43,760 నగదు నాలుగు విడతలుగా పోయాయని, వెంటనే సైబర్ క్రైమ్ నంబర్ 1930కి కాల్ చేశానని బాధితుడు తెలిపారు. తిరుపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

తల్లాడ: మండలంలోని మద్దునూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఐదుగురు వ్యక్తులు ముసుగులో వచ్చి అనుమోలు రామారావుపై దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అనుమోలు రామారావు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాస్పదంగా మారిన ప్రేమికుల వ్యవహారం

పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న స్థానికులు

పాల్వంచ: ఇద్దరు ప్రేమికుల ప్రేమ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఆదివారం సాయంత్రం పోలీసుల అదుపులో ఉన్న అమ్మాయిని, అబ్బాయికి అప్పగించాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగడంతో డీఎస్పీ సతీష్‌కుమార్ నచ్చజెప్పి సర్దుమనిపించారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన యువతి, ఎర్రగుంటకు చెందిన యువకుడు కలిసి ఈనెల 16వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. కాగ, ఈ విషయంపై యువతి తల్లిదండ్రులు మిస్సింగ్ అయిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు హైదరాబాద్‌లో ఉన్న ఆమెను వెతికి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయితే యువకుడి బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు కొంత మంది కలిసి అమ్మాయిని అబ్బాయికి అప్పగించాలని, వారికి వివాహం జరిగిదంటూ ఆందోళనకు దిగారు. స్టేషన్ ఎదుట ఎస్‌ఐ రాఘవయ్య, సిబ్బందితో వాదోపవాదాలకు దిగి ధర్నా చేశారు. దీంతో డీఎస్పీ సతీష్‌కుమార్ అక్కడకు చేరుకుని అమ్మాయిని సోమవారం జడ్జి ముందు ప్రవేశపెడతామని, ఎవరి దగ్గరకు వెళ్తే వారి వద్దకు భద్రత ఇచ్చి పంపిస్తామని చెప్పడంతో సద్దుమణిగింది. ఈ విషయమై డీఎస్పీని వివరణ కోరగా.. 16వ తేదీన 19 ఏళ్ల యువతి కనిపించడం లేదని ఫిర్యాదు రావడంతో ఆమెను రెండు టీంల ద్వారా వెతికి తీసుకొచ్చామని, ఆమె ఒకసారి తానే వెళ్లానని, మరోసారి యువకుడే తీసుకెళ్లాడని చెబుతుందని, జడ్జి ముందు ప్రవేశపెట్టి ఆమె ఇష్టానుసారంగా పంపిస్తామని తెలిపారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య



సుమంత్ (ఫైల్)

ఇల్లెందు: అప్పుల బాధతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లెందు పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురంకు చెందిన రెడ్డిబోయిన సుమంత్ (36)కు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు రేఖాశ్రీ, రిత్వికశ్రీలు ఉన్నారు. అయితే ఫైనాన్స్‌లో ఆటో కొనుగోలు చేసి నెలకు ఈఎంఐ సుమారు రూ.12వేలు కట్టేలా తీసుకుని నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో గత కొంతకాలంగా ఆటోలకు గిరాకీ లేకపోవడంతో ఫైనాన్స్ నుంచి ఒత్తిడి పెరగడంతో పాటు కుటుంబం గడవడం కష్టంగా మారింది. దీంతో గత్యంతరం లేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే నివాళి..

ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ వారా రవిలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

కిటకిటలాడిన బస్టాండ్లు

- తిరుగు ప్రయాణికులతో కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణాలు
- ముగిసిన సంక్రాంతి, వారాంతపు సెలవులు
- హైదరాబాద్‌కు పయనమవడంతో రద్దీ
- అదనపు బస్సులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ



హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఖమ్మం కొత్త బస్టాండ్

ఖమ్మంమయూరిసెంటర్: సంక్రాంతి పండుగ సెలవులకు హైదరాబాద్ నగరం నుంచి సొంత ఊర్లకు వచ్చిన ప్రయాణికులు తిరుగు పయనమయ్యారు. పండుగ, వారాంతపు సెలవులు ముగియడంతో తిరిగి తమ దైనందిన జీవితంలోకి అడుగుపెట్టేందుకు నగరాలకు వెళ్తున్నారు. సంక్రాంతి పండగకు ఇంటికి వచ్చిన వారిలో అనేక మంది ఈ నెల 16, 17 తేదీల్లోనే తిరిగి వెళ్లగా.. అత్యధిక శాతం ప్రయాణికులు ఆదివారం వెళ్లేందుకు ఆసక్తి చూపించారు. దీంతో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికుల రద్దీ కొనసాగింది. ముఖ్యంగా ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులు నిండిపోయారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రీజియన్ బస్సులతో పాటు హైదరాబాద్ సిటీ నుంచి ప్రత్యేక బస్సులను ఖమ్మానికి రప్పించి ప్రయాణికులను తరలించారు.

నిరంతరం పర్యవేక్షణ..

జిల్లా నుంచి హైదరాబాద్ నగరానికి వెళ్లే ప్రయాణికులు ఆదివారం ఖమ్మం కొత్త బస్టాండ్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ పెరగకుండా అధికారులు పూర్తిస్థాయి చర్యలు తీసుకున్నారు. ఖమ్మం ఆర్ఎం సరిరామ్ నేతృత్వంలో ఆర్టీసీ అధికారులు డిప్యూటీ ఆర్ఎం, ఖమ్మం డీఎం, ఇతర అధికారులు, సిబ్బంది బస్టాండ్‌లో ఉండి పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు బస్సులను ఏర్పాటు చేసి బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులను వచ్చినట్లే బస్సులు ఎక్కించి పంపించారు. ఉదయం 6 గంటల నుంచే ఈ ప్రక్రియను కొనసాగడంతో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బస్సుల్లో ఎక్కి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అటు పోలీసులు, ఇటు ఆర్టీసీ పోలీస్ సెక్యూరిటీ పర్యవేక్షించారు. ఆర్టీసీ పోలీస్ సెక్యూరిటీ 21 మంది విధుల్లో ఉన్నారు.



ఖమ్మం పాత బస్టాండ్‌లో భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

సిబ్బందికి భోజనాలు..

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ప్రత్యేక చొరవ చూపిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు సిబ్బంది క్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది భోజనం తెచ్చుకునే సమయం కూడా దొరకడం లేదు. దీంతో ఆర్టీసీ అధికారులు ఆదివారం విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, ఉద్యోగులకు బస్టాండ్‌లలో భోజనాలు ఏర్పాటు చేశారు.

వందకు పైగా..

వేలాది మంది ప్రయాణికులు హైదరాబాద్ నగరానికి వెళ్లేందుకు రీజియన్‌లోని బస్టాండ్లకు చేరుకుంటుండటంతో ఆర్టీసీ అధికారులు రోజువారి సర్వీసులతో పాటు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. ఖమ్మం కొత్త బస్టాండ్‌తో పాటు సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మధిర డిపోల నుంచి అదనపు సర్వీసులను నడిపారు. 100కు పైగా బస్సులను అదనంగా ఏర్పాటు చేసి ప్రయాణికులను తరలించారు. ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు విధించినా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరేందుకు ఎక్కడా ఆలోచించకుండా అందుబాటులో ఉన్న బస్సులను ఎక్కేందుకు ఆసక్తి చూపారు. అటు రీజియన్‌లోని రిజర్వేషన్ బస్సులు వారం రోజులు ముందుగానే సీట్లు బుక్ అవ్వడంతో అధికారులు అదనపు బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. దీంతో ప్రయాణికులు తమ టికెట్లను రిజర్వ్ చేసుకొని మరీ బస్సులు ఎక్కారు.

వారి 'సంకల్పం' ఆకట్టుకుంది..

- ప్రకృతి వ్యవసాయంపై మహిళా కళాకారుల బృందం ప్రత్యేక ప్రదర్శన
- అలరించిన శ్రీముఖి కూచిపూడి నృత్యం



సంకల్పం నాటిక ప్రదర్శనలో సన్నివేశం



నృత్యం చేస్తున్న వనం శ్రీముఖి

ఖమ్మంగాంధీచౌక్: వర్షాలు లేక, పంటలు పండక, అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనల నేపథ్యాన ఓ కూతురు.. తండ్రి వ్యవసాయ వారసత్వాన్ని తీసుకొని ప్రకృతి వ్యవసాయం చేసి ఆదర్శరైతుగా గుర్తింపు పొందటంతో పాటే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దటం ఇతి వృత్తంగా ప్రదర్శించిన సంకల్పం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 90వ అభ్యుదయ సాంస్కృతిక కదంబంగా విశాఖపట్టణానికి చెందిన జాస్మిన్ ఆర్ట్స్ కల్చరల్ ఈవెంట్స్ కళా బృందం నాటికను ప్రదర్శించింది. రావి నాగేశ్వరరావు రచించిన నాటికకు సంధ్యా ప్రియదర్శిని దర్శకత్వం వహించారు. నాటికను పూర్తిగా మహిళా కళాకారులు సంధ్యా ప్రియదర్శిని, సీతామహాలక్ష్మి, వరలక్ష్మి, శివజ్యోతి, సుజాత ప్రదర్శించారు. కాగా, నెల నెలా వెన్నెల సాంస్కృతిక కార్యక్రమంలో భద్రాచలానికి చెందిన వనం శ్రీముఖి ప్రదర్శించిన శాస్త్రీయ కూచిపూడి నృత్యం ప్రేక్షకులను రంజింపజేసింది. ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్రీముఖి 'యదువంశ సుదాంబుజ రారా' గీతానికి నృత్య ప్రదర్శన చేశారు. విద్యావేత్త, రచయిత రవిమారుత్ శ్రీముఖిని అభినందించారు. కార్యక్రమంలో జల్లా లక్ష్మీనారాయణ, తిరుమలాచార్యులు, డాక్టర్ వనం కృష్ణవేణి, మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, డాక్టర్ నాగబత్తిని రవి, దేవేంద్ర, సదానందం, లక్ష్మీనారాయణ, మొగిలి గుణకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో గల ఇండోర్ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగిసింది. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సింగిల్స్, డబుల్స్ అంశాల్లో 70 ఎంట్రీలు అందాయి. కాగా, బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్, ఏఎస్పీ జి.వెంకట్రావు, మాజీ అధ్యక్షులు పి.రవిమారుత్, సిరిపురపు సుదర్శన్, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, ఈ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

విజేతలు వీరే..

జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో 35 ఏళ్లకు పైబడిన విభాగంలో సింగిల్స్‌లో ఎం.నరేష్, కె.నర్సింహారావు, డబుల్స్‌లో టి.అప్పారావు, డి.నవీన్‌రెడ్డి–ఎం.నరేష్, సుధాకర్ సహజ్, 40 ఏళ్ల విభాగంలో సింగిల్స్‌లో కార్తీక్, నవీన్, డబుల్స్‌లో బి.దాస్, బి.మంగిత్యా–టి.సత్యరెడ్డి, ఎ.సత్యం, 45 ఏళ్ల కేటగిరీలో సింగిల్స్‌లో వి.నర్సింహారావు, జి.అనిల్‌కుమార్, డబుల్స్‌లో ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, వై.పాపారావు– వి.రాంచద్రయ్య,ఎండీ పర్వేజ్, ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

అలాగే 55ఏళ్లకు పైబడిన వారిలో సింగిల్స్‌లో ఎ.సురేష్‌కుమార్, డి.సత్యనారాయణ, డబుల్స్‌లో డి.సత్యనారాయణ, ఎ.సురేష్‌కుమార్, 56 ఏళ్ల పైబడిన వారిలో సింగిల్స్‌లో పీవీఆర్, జి.రామకృష్ణ, డబుల్స్‌లో టీకే సూరి, జె.శ్రీను–లక్ష్మణ్, సైదులు, 60 ప్లస్ కేటగిరీలో ఎస్‌డీ ఖాజామోద్దీన్, కోటయ్య, డబుల్స్‌లో ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.ఖాజీమోయినోద్దీన్–కోటయ్య, ఎ.భద్రం, 65ఏళ్ల విభాగంలో సింగిల్స్‌లో ఎ.సత్యనారాయణ, డబుల్స్‌లో ఎ.సత్యనారాయణ. రమేష్–కె.సైదయ్య, సీహెచ్.వెంకటేశ్వరరావులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.

ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే..

- ఇది మాల, మాదిగల సమస్య కాదు
- మేధావుల సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న మువ్వా శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేసి తీరాల్సిందేనని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఇది మాల, మాదిగల మధ్య గొడవ కాదని, రెండు కులాల సమస్యగా చూడొద్దని హితవు పలికారు. జాషువా సాహిత్య వేదిక, స్పర్శ సామాజిక అధ్యయన వేదిక, బీసీ సంఘాల జేఏసీ, తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ – మేధావుల సంఘీభావ సదస్సు ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలు కుల, ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల నాయకులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలు పాల్గొని ప్రసంగించి సంఘీభావం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ మాల, మాదిగల పంచాయతీ కాదన్నారు. కొంతమంది అలా వ్యవహరిస్తూ చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, అట్టడగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు దక్కాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారని, అందుకే సమాజంలో అట్టడుగున ఉన్న మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు దక్కేందుకు అందరూ సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాల, మాదిగలు రెండూ అణగారిన వర్గాలనేది గమనించాలని, సదస్సులు, సమావేశాలకు పరిమితం కాకుండా ఒక కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 40 ఏళ్లుగా వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. సమగ్ర సర్వేద్వారా 91 శాతంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఉన్నట్లు తెలుస్తోందని, వీరంతా ఐక్యంగా రాజ్యాధికారం కోసం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు తాత మధుసూదన్, ఐవీ రమణారావు, నల్లమల వెంకటేశ్వరరావు, చోటే బాబా, కోట రాంబాబు, కూరపాటి వెంకటేశ్వర్లు, శింగు నర్సింహారావు, ఎం.సుబ్బారావు, ఆవుల అశోక్, అవునూరి మధు, ఎన్.తిర్మల్, మనోహర్‌రాజు, జీవీ నాగమల్లేశ్వరరావు, గురుమూర్తి, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, మేకల సుగుణారావు, దేవిరెడ్డి విజయ్, కోండ్రు బ్రహ్మం, నామా పురుషోత్తం, కన్నెగంటి వెంకటయ్య, చిర్రా రవి, ఐనాల సైదులు, గద్దపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీవీపాలెంలో సుపారీ బ్యాచ్‌ల కలకలం

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో సుపారి బ్యాచ్‌ల కలకలం చోటుచేసుకుంటుంది. వారం రోజులు కిందట ఒక ట్రాక్టర్ డ్రైవర్, యజమాని మధ్య ఏర్పడిన వివాదంలో మూడో వ్యక్తి కలుగజేసుకొని ట్రాక్టర్ యజమానిపై దాడి చేయడం, దానిని దృష్టిలో పెట్టుకుని యజమాని సుపారి మాట్లాడిన ఘటనపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. కాగా, గ్రామంలో మరొకరిని కొట్టేందుకు సుపారి మాట్లాడినట్లు విషయం బయటకు తెలియడంతో ఆ వ్యక్తిని రఘునాథపాలెం పోలీసులు విచారణకు పిలిచి మందలించి పంపినట్లు తెలిసింది. ఈ విషయంపై రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేయలేదని, ఆరోపణలు రావడంతో ఆ వ్యక్తిని పిలిపించి మాట్లాడితే కావాలనే తనపై కొంతమంది ప్రచారం చేస్తున్నారని వివరణ ఇచ్చినట్లు తెలిపారు.

శానిటరీ సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీస్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలో అందుబాటులో లేని కేఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్యకు కేఎంసీ కమిషనర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలో కమిషనర్ పర్యటన సందర్భంగా రోటరీనగర్‌లో వీధి వ్యాపారుల ప్రాంగణానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడకు శానిటరీ సూపర్‌వైజర్‌ను రావాలని సూచించగా.. అందుబాటులో లేరనే విషయం కమిషనర్ దృష్టికి వచ్చింది. ఎలాంటి సమాచారం లేకుండా నగరం వదిలి వెళ్లడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో షోకాజ్ నోటీసుకు వివరణ ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు.

భీమా జ్యువెల్స్ షోరూం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: విశ్వసనీయత, స్వచ్ఛత, శ్రేష్ఠతకు మారుపేరైన భీమా జ్యువెల్స్ షోరూంను ఖమ్మంలో ప్రారంభించామని సంస్థ చైర్మన్ బి.బిందుమాధవ్ తెలిపారు. నగరంలోని వైరా రోడ్ బాబూరావు పెట్రోల్ బంక్ ఎదురుగా బీకే బజార్ కాలనీ, ఖానాపురం హవేలీ కాలనీల్లో శనివారం షోరూం బ్రాంచ్‌లను ప్రారంభించి మాట్లాడారు. కస్టమర్ల నమ్మకం తరతరాలుగా సంస్థకు ప్రేరణగా ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ బిందుమాధవ్ మాట్లాడుతూ.. ఈ షోరూం కస్టమర్ల సంతృప్తికి శాశ్వత చిహ్నంగా ఉంటుందని తెలిపారు. కాగా, షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా బంగారు ఆభరణాలకు మేకింగ్ చార్జీలపై ఫ్లాట్ 5 తగ్గింపు ఉంటుందని ప్రకటించారు. ఓల్డ్ గోల్డ్ ఎక్స్చేంజ్‌లో గ్రాముకు రూ.50 అదనంగా పొందవచ్చని, వజ్రాల ఆభరణాల క్యారెట్ విలువ 25 శాతం వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. సిల్వర్ జ్యువెలర్స్‌పై కిలో గ్రాముకు ఫ్లాట్ రూ.4 వేల తగ్గింపు ఉంటుందని ప్రకటించారు.

యువకుడి బలవన్మరణంపై విభిన్న కథనాలు

లోన్‌యాప్ వేధింపులు అని, ప్రేయసి మృతితో అంటూ ప్రచారం




సంతోష్ (ఫైల్)


ఇల్లెందు: లోన్ యాప్ వేధింపులు, తాను ప్రేమించిన యువతీ ప్రమాదంలో మృతి చెందడంతో లోథ్ సంతోష్ ఆత్మహత్య చేసుకున్నాడని అంటున్నారు. పట్టణంలోని నంబర్-2 బస్తీ 4వ వార్డుకు చెందిన సంతోష్ బలవన్మరణంలో భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. స్టేట్‌ఫిట్ బస్తీకి చెందిన తన టెన్త్ క్లాస్ విద్యార్థిని ప్రేమించాడని, ఆ యువతిని పెళ్లి చేసుకోమని సంతోష్ ఇంటికి చేరగా.. యువతి వైపు వారు వచ్చి నచ్చజెప్పి పంచాయతీ చేసి తీసుకుని వెళ్లినట్లు ప్రచారంలో ఉంది. ఇదిలా ఉండగా రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో ఆ యువతీ మృతి చెందడంతో సంతోష్ మానసికంగా అనారోగ్యపాలయ్యాడు. ఈనేపథ్యాన ఆమె సమాధి వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి చిన్న ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సమాచారం తన మిత్రులకు కుటుంబసభ్యులకు మెస్సేజ్ పంపినట్లు వెల్లడించారు.

సోషల్ మీడియాలో యువకుడి సూసైడ్ నోట్..

సూసైడ్ నోట్‌లో లోన్ యాప్‌లో రూ.లక్ష వరకు రుణం తీసుకుని ఆన్‌లైన్‌లో ఆటలు ఆడానని, తన పిన్ని చిట్టి డబ్బులు కూడా వాడుకున్నట్లు రాశాడు. లోన్‌యాప్ నిర్వాహకుల నుంచి బెదిరింపు మెస్సేజ్‌లు, ఫోన్‌లు రావడం, ఫొటోలు మార్ఫింగ్ చేసి మిత్రులకు పంపిస్తామని బెదిరించేవారని పేర్కొన్నాడు. తన ప్రియురాలు లేనప్పుడు తానెందుకు బతికుండాలని ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు చెప్పాడు. సంతోష్ తండ్రి ఫిర్యాదు ఆధారంగానే ఎస్‌ఐ సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, సంతోష్ తండ్రి చిన్న తన కుమారుడు మృతి చెందిన సంఘటనలో లోన్‌యాప్ వేధింపులున్నాయని అతడి సూసైట్ నోట్‌లో పేర్కొన్నా.. ఫిర్యాదులో మాత్రం ఆ అంశం ప్రస్తావించకపోవడం గమనార్హం.



పోలీసులకు సంతోష్ తండ్రి అందజేసిన ఫిర్యాదు



Sorry for 😔 all. Naku brathakali ani ledha

సోషల్ మీడియాలో వైరల్ అయిన సూసైడ్ నోట్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నేతకాని గోపి (ఫైల్)

కొణిజర్ల: కారు, ద్విచక్రవాహనం ఢీకొని దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కూసుమంచి మండలం నాయకన్‌గూడెంనకు చెందిన దివ్యాంగుడు నేతకాని గోపి (36) మరో ముగ్గురు దివ్యాంగులు ఓర్సు రామారావు, ఆడెపు వీరభద్రం, మల్లికార్జున్‌తో కలిసి వైరాలో దివ్యాంగ సంఘం మహిళా నేత ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. మూడు చక్రాల ద్విచక్రవాహనంపై తిరిగి గోపి, రామారావు బయలుదేరారు. శాంతినగర్ వైష్ణవి పాల ఫ్యాక్టరీ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. వెనకాలే మరో వాహనంపై వస్తున్న వీరభద్రం, మల్లికార్జున్ క్షతగాత్రులను ప్రమాదానికి కారణమైన కారులోనే ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అప్పటికే గోపి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్ జి.రవిబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి ...

తల్లాడ: మండలంలోని కలకొడిమ గ్రామానికి చెందిన బాడిశ పుల్లారావు రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పుల్లారావు (31) గత నెల 26న టీవీఎస్ ఎక్సెల్‌పై నూతనకల్ నుంచి కలకొడిమ వెళ్తుండగా మిట్టపల్లి వైన్ షాపు ఎదురుగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో పుల్లారావుకు తీవ్ర గాయాలు కాగా.. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ శశికుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాల్వంచ: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పాత పాల్వంచకు చెందిన ఎ.సందీప్(37) గత కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యపాలయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 16వ తేదీన కడుపునొప్పి తాళలేక ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఉమ, కొడుకు, కూతురు ఉన్నారు. తండ్రి హరినాథ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మధిర: రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 30 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవటంతో మృతదేహాన్ని మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మధిర జీఆర్పీ ఔట్ పోస్ట్ ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



చిత్తారమ్మ జాతరకు వెల్లువెత్తిన భక్తులు

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని గాజుల రామారం శ్రీ చిత్తారమ్మ దేవి ఆలయ జాతర స్వర్ణోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. చిత్తారమ్మా.. మమ్మల్ని దీవించు తల్లీ.. అంటూ భక్తజనం తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్త జనంతో ఆ ప్రాంతమంతా జనసంద్రమైంది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తదితరులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని నగరంతో పాటు రాష్ట్ర, రాష్ట్రేతర భక్తులు సుమారు 3 లక్షల మందికి పైగా దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– కుత్బుల్లాపూర్

కొమురవెల్లికి పోటెత్తిన భక్తజనం



మహా జాతర ప్రారంభం

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రమైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం బ్రహ్మోత్సవాలు (మహాజాతర) అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో ప్రారంభమయ్యే ఈ జాతర మూడు నెలల పాటు కొనసాగనుంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. మహిళలు బోనాలతో తరలివచ్చారు. మల్లన్న స్వామికి, గుట్టపై వెలిసిన రేణుక ఎల్లమ్మకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో స్వామి వారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టింది. హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం ఆలయ తోటబావి ప్రాంగణంలో నిర్వహించే పెద్దపట్నం, అగ్నిగుండాలకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల: తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం నిర్ణీత సమయంలో జరుగుతోంది. ఆదివారం అర్ధరాత్రితో వైకుంఠ ద్వార దర్శనం ముగిసింది. శనివారం తిరుమల శ్రీవారిని 75,931 మంది దర్శించుకోగా.. 25,717 మంది తలనీలాలు సమర్పించారు. అదేవిధంగా శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.4 కోట్లు లభించింది. కాగా, ఘాట్‌రోడ్డులో పొగ మంచు దట్టంగా కమ్మేసింది. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని టీటీడీ భద్రతా సిబ్బంది సూచించింది.

శ్రీవారి సన్నిధిలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని ఆదివారం మంత్రి సవిత, సినీ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్‌లు ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి, బాల నటుడు రేవంత్, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, నిర్మాత దానయ్య, సినీ నటుడు రాజకుమార్ దర్శించుకున్నారు.

దుర్గమ్మ సేవలో కేంద్రమంత్రి బండి సంజయ్



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని కనకదుర్గమ్మను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

ప్రజల భద్రతకు ఎన్‌డీఆర్‌ఎఫ్ భరోసా

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా

సాక్షి, అమరావతి: విపత్తులు సంభవించినప్పుడు ప్రజల భద్రతకు భరోసానిస్తూ జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) నిరుపమాన సేవలు అందిస్తోందని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం నిర్వహించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్, దక్షిణ క్యాంపస్ భవనాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం మూడింతల అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆరు నెలల్లోనే రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల విలువైన సహకారం అందించామని తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడంతోపాటు రాజధాని అమరావతి నిర్మాణానికి హడ్కో ద్వారా రూ.27 వేల కోట్ల సహాయం అందిస్తున్నామని చెప్పారు. 2028 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అమిత్ షా మనిషిలా కాకుండా మెషిన్‌లా పని చేస్తున్నారని, ఆయన పనితీరు చూస్తుంటే అసూయ కలుగుతోందన్నారు. పీపీపీ విధానంలో 'గోదావరి – బనకచర్ల' అనుసంధానానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ బృహత్తర కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విపత్తులను తక్షణం ఎదుర్కొనేందుకు గ్రామ స్థాయిలోకూడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమిత్ షా గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరారు.



ఎన్డీఆర్ఎఫ్ పరికరాలను పరిశీలిస్తున్న అమిత్‌షా, చంద్రబాబు తదితరులు

తొక్కిసలాట ఘటనపై దృష్టి


తిరుపతిలో ఇటీవల చోటు చేసుకున్న తిరుమల శ్రీవారి భక్తుల తొక్కిసలాట ఘటనపై కేంద్ర హోమ్ శాఖ సైతం దృష్టి సారించిందని ఆ శాఖ మంత్రి అమిత్‌షా వీహెచ్‌పీ నేతల భేటీలో వెల్లడించారు. అధికారిక కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయనతో ఆదివారం ఉదయం వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు నేతృత్వంలో సంఘ ప్రముఖులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇటీవల విజయవాడలో వీహెచ్‌పీ నిర్వహించిన హైందవ శంఖారావం సభ గురించి వారు అమిత్‌షాకు వివరించారు. దేశ వ్యాప్తంగా ఆలయాలను ప్రభుత్వ పరిధి నుంచి పూర్తిగా తప్పించి, స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు కేంద్రం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి తొక్కిసలాట అంశం వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై కేంద్ర హోం శాఖ కూడా పరిశీలిస్తోందని కేంద్ర మంత్రి వీహెచ్‌పీ నేతలకు వివరించారని తెలిసింది.

ప్రజలు ఏమనుకుంటున్నారు..?

రాష్ట్రంలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు ఎలాంటి భావంతో ఉన్నారని కేంద్ర మంత్రి అమిత్ షా.. రాష్ట్ర బీజేపీ నేతలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం ఆయన బస చేసిన హోటల్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర సహాయ మంత్రి భూపతి శ్రీనివాసవర్మ, రాష్ట్ర పార్టీ సంఘటన కార్యదర్శి మధుకర్‌లతో కొద్దిసేపు సమావేశమై రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాలపై పెద్ద ఎత్తున ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర నేతలకు సూచించారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని దిశా నిర్దేశనం చేశారు. నామినేటెడ్ పదవుల పంపకం సహా కూటమి పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉందన్న దానిపై కూడా ఈ భేటీలో చర్చ జరిగింది.

2014 నుంచి 2019 వరకు
ఏపీలో విధ్వంసం

చంద్రబాబు సమక్షంలోనే అమిత్‌షా సంచలన వ్యాఖ్యలు



natural calamities strike, NDRF comes to the rescue, and when man-made calamities occur, the Narendra Modi government comes to the help. Shri Shah said that in the five years from 2014 to 2019 Andhra Pradesh has faced significant setbacks due to the man-made disaster, affecting the immense potential of the state. He said that to make up for the developmental losses during the period, Prime Minister Shri Narendra Modi and Chief Minister Shri N. Chandrababu Naidu are driving Andhra

ఏపీలో 2014-19 మధ్య మానవ తప్పిదాలతో విధ్వంసం సృష్టించారని అమిత్‌షా చెప్పిన విషయాన్ని, ప్రెస్‌నోట్‌లోనూ స్పష్టంగా పేర్కొన్న పీఐబీ

సాక్షి, అమరావతి: 'అపార సహజ వనరులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి 2019 వరకు విధ్వంసం సృష్టించారు. అది మానవ తప్పిదాలతో సృష్టించిన విధ్వంసం (మ్యాన్ మేడ్ డిజాస్టర్). దాంతో ఆ ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అభివృద్ధి పూర్తిగా అడుగంటింది' అని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం నిర్వహించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమిత్ షా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ఆ ఐదేళ్లలో జరిగిన విధ్వంసానికి మూడు రెట్లు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కాగా, అమిత్ షా హిందీ ప్రసంగాన్ని తెలుగులో అనువదించిన బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాత్రం చంద్రబాబుపట్ల స్వామి భక్తి ప్రదర్శించారు. అమిత్ షా ప్రసంగాన్ని తెలుగులోకి అనువదిస్తూ '2019 నుంచి ఐదేళ్లపాటు రాష్ట్రంలో జరిగిన విధ్వంసం' అని మార్చి చెప్పారు. అమిత్ షా 2014 నుంచి 2019 వరకు అని స్పష్టంగా ప్రసంగిస్తే... పురందేశ్వరి మాత్రం 2019 నుంచి ఐదేళ్లపాటు అని అనువదించారు. కానీ అమిత్ షా ప్రసంగాన్ని అధికారికంగా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ సమాచార విభాగం 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) మాత్రం అసలు విషయాన్ని వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది. '2014 నుంచి 2019 వరకు మానవ తప్పిదం సృష్టించిన విధ్వంసంతో ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది' అని అమిత్ షా ప్రసంగించినట్టు ఆ ప్రకటనలో అధికారికంగా పేర్కొంది. మరోవైపు అమిత్ షా నేరుగా హిందీలో చేసిన ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మోదీ మనసులో ఉన్న మాటనే అమిత్ షా చెప్పారని పలువురు వ్యాఖ్యానించారు. అంటే చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంసం సృష్టించిందని, అది మానవ తప్పిదంతో జరిగిన విధ్వంసమేనని అమిత్ షా చెప్పారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

జిల్లా వార్తలు

మిర్చి రైతు కంట్లో కన్నీరు



మధిర మార్కెట్‌లో మిర్చి శాంపిళ్లను పరిశీలిస్తున్న వ్యాపారులు (ఫైల్)

- మార్కెట్‌లోకి కొత్త మిర్చి రాక ప్రారంభం
- తగ్గిన ఎగుమతులు.. కర్ణాటక నుంచి ఫ్యాక్టరీలకు దిగుమతి
- మంచి ధర కోసం నిల్వ చేసిన రైతులకు తీరని నష్టం
- రైతులకు తోడు వ్యాపారులూ నష్టాల ఊబిలోకి..

మధిర: ఈ ఏడాది పండిన కొత్త మిర్చి మార్కెట్‌లోకి వస్తుండటం, ఎగుమతులు ఆశాజనకంగా లేకపోవడం.. నూనె తీసే మిల్లులు కర్ణాటక రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకుంటుండటం వంటి కారణాలతో మిర్చి ధర నానాటికీ క్షీణిస్తోంది. ఖమ్మం జిల్లాలోని 42 కోల్డ్ స్టోరేజీల్లో 45 లక్షల మిర్చి బస్తాల నిల్వకు అవకాశం ఉండగా, గత ఏడాది పండించిన పంట సుమారు 40 శాతం మేర ఇంకా నిల్వ ఉంది. ఇంతలోనే ఈ ఏడాది పండిన పంటను రైతులు తీసుకొస్తుండగా నిల్వ మిర్చి కొనుగోళ్లకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ అమ్ముదామనుకున్నా ధర తగ్గిస్తుండటం, వారం తర్వాత వస్తే ఇంకా తగ్గించి అడుగుతుండటంతో రైతులు ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గత ఏడాది తేజా రకం మిర్చిని కల్లంలో క్వింటాకు రూ.24 వేలకు అడగగా.. ఇప్పుడు రూ.15 వేలకు మించి పలకడం లేదు. ఫలితంగా ఇంటి అవసరాలకు తోడు అప్పులు తీర్చేందుకు మార్కెట్‌కు వస్తున్న రైతులకు కన్నీరే మిగులుతోంది.

ఈ నష్టం పూడ్చుకునేదెలా?

రైతులకు తోడు కల్లాలు, కోల్డ్ స్టోరేజీలో మిర్చి స్టాక్ పెట్టిన వ్యాపారులకు సైతం నష్టం ఎదురవుతోంది. ఇదిలా ఉండగా గత ఏడాది మిర్చికి మంచి ధర ఉండటంతో కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులు బ్యాంకు రుణంతోపాటు రైతులకు చేబదులుగా నగదు ఇచ్చారు. కానీ నాటికి నేటికి ధరలో సగం తేడా ఉండటం, తీసుకున్న రుణాలపై వడ్డీలు, నిల్వచేసిన బస్తాలకు అద్దె, ఎగుమతి, దిగుమతి తదితర ఖర్చులు కలిపి క్వింటాకు రూ.12 వేల నుంచి రూ.15 వేలు నష్టం వస్తోంది. కాగా, కొందరు రైతులు నిల్వ చేసిన సరుకును అమ్ముకుంటే వచ్చే డబ్బు పోను కోల్డ్ స్టోరేజీల యాజమాన్యాలకు తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. ఫలితంగా ఇంకా కొన్నాళ్లు వేచి ఉండాలనే భావనతో రైతులు కోల్డ్ స్టోరేజీలు, మార్కెట్ వైపునకు వెళ్లడం లేదు. దీంతో అద్దె కూడా రాక కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులూ నష్టాల్లో కూరుకుపోతున్నారు.

కర్ణాటక నుంచి దిగుమతి

ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పండే తేజ్యా రకం మిర్చిని చైనా, థాయిలాండ్, మలేషియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. అయితే, ఇదే రకాన్ని పోలిన బ్యాడిగి రకం మిర్చిని రెండేళ్లుగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లోనూ సాగు చేస్తున్నారు. ఇంతలోనే విదేశాలకు ఎగుమతులు మందగించాయి. ఇక బ్యాడిగి రకం మిర్చి కర్ణాటకలో క్వింటా రూ.6 వేల నుంచి రూ.7 వేలకు లభిస్తోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న మిర్చి నూనె ఫ్యాక్టరీల యజమాన్యాలు అక్కడి నుంచే దిగుమతి చేసుకుంటున్నారు. సాధారణంగా ఈ మిల్లులకు ఏటా 6 లక్షల బస్తాల మిర్చి అవసరమవుతుంది. ఇప్పుడు ఇక్కడ కాకుండా కర్ణాటక నుంచి తెప్పిస్తుండటంతో స్థానిక రైతులకు ధర దక్కకపోగా కోల్డ్ స్టోరేజీల్లో నిల్వలు తరగడం లేదు.

మధిర మండలం ఆర్లపాడుకు చెందిన మందడపు అప్పారావు గత ఏడాది సాగు చేసిన మిర్చిని కల్లంలో క్వింటాకు రూ.23 వేల చొప్పున అడిగారు. అయితే, మరింత ధర వస్తుందనే భావనతో 120 బస్తాల మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశాడు. ఇప్పుడు మార్కెట్‌కు శాంపిల్ తీసుకొస్తే క్వింటాకు రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. దీంతో క్వింటాకు రూ.11 వేలు వరకు నష్టపోతుండగా స్టోరేజీ అద్దె, తీసుకున్న రుణానికి వడ్డీ కలిపి మరో రూ.4 వేలు వెరసి క్వింటాకు రూ.15 వేలు నష్టం ఎదురవుతోంది. ఈ పరిస్థితుల్లో మిర్చి సాగు చేయాలంటేనే భయమేస్తోందని అప్పారావు వాపోయాడు.



మందడపు అప్పారావు

రోజురోజుకూ తగ్గిపోతోంది



కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసిన మిర్చిని అమ్ముదామని నెల రోజులుగా మార్కెట్‌కు వచ్చివెళ్తున్నా. పంట పండినప్పుడు కల్లంలో క్వింటా రూ.21 వేలకు అడిగారు. కానీ ఇప్పుడు రూ.12 వేలకు మించి ధర పలకడం లేదు. అద్దె, ఖర్చులు, వడ్డీలు కలిపితే నష్టం భారీగానే ఉంటుంది.

–కావూరి వెంకటేశ్వరరావు, ఎర్రమాడు

అందరికీ నష్టమే



ఈ ఏడాది రైతులు, వ్యాపారులతో పాటు కోల్డ్ స్టోరేజీల యాజమాన్యాలకూ నష్టమే. కొత్త పంట మార్కెట్‌లోకి వస్తోంది. ఈ సమయాన ఎగుమతులు లేవు. మరోపక్క ఇతర రాష్ట్రాల్లో మిర్చి తక్కువ ధరకే లభిస్తుండటంతో ఇక్కడి వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు.

–మందడపు రామకృష్ణ, కోల్డ్ స్టోరేజెస్ అసోసియేషన్ అధ్యక్షుడు

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.43,630

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. మొత్తం 726 మంది కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.25,030, 300 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.18,600 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

ఇక్కడే అప్రెంటిస్‌షిప్ ఇవ్వండి..



సింగరేణి డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్, తదితరులు (ఫైల్)

- ఇతర ఏరియాల్లో సీట్లతో ఇబ్బంది పడుతున్నామంటున్న అభ్యర్థులు
- సింగరేణిలో వెల్లువెత్తుతున్న వినతులు
- 1,600 ఖాళీలకు 2,400 దరఖాస్తులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ అప్రెంటిస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి స్థానికత ఆధారంగా వారి ఏరియాల్లోనే అవకాశం కల్పించేవారు. అయితే, ఈ విధానంతో కొన్ని ఏరియాల్లో సీట్లు నిండుతుండగా మిగతా ఏరియాల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. దీంతో అధికారులు ఈ ఏడాది నుంచి కౌన్సెలింగ్ విధానంలో అప్రెంటిస్ షిప్ కేటాయిస్తుండడంతో ఒక ఏరియా వారికి ఇంకో ఏరియాలో సీటు దక్కుతోంది. అయితే, ఏడాది పాటు శిక్షణలో వచ్చే అరకొర నగదుతో అద్దె గదుల్లో ఉండడం కష్టమవుతున్నందున స్థానికంగా అవకాశం ఇవ్వాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

ఏటాది వ్యవధితో...

సింగరేణి సంస్థలో అప్రెంటిస్ యాక్ట్ 1961 ప్రకారం ఏడాడి కాల వ్యవధిలో అప్రెంటిస్ షిప్ శిక్షణ ఇస్తారు. ఈ ఏడాది 1,600 ఖాళీలకు 2,400 దరఖాస్తులు అందాయి. కాగా, ఖాళీల్లో 80శాతం సింగరేణి ఉద్యోగుల పిల్లలు, సంస్థ ప్రభావిత ప్రాంతాలు, భూమి కోల్పోయిన వారి పిల్లలకు, మరో 20 శాతం ఇతరులకు కేటాయిస్తారు. ఇందులో ప్రధాన అర్హత ఐటీఐ పూర్తిచేసి నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగా ఉండాలి. అయితే, ఐటీఐలో ట్రేడ్లు, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తుండగా గతంలో ఏ ఏరియా వారికి అక్కడే అవకాశం కల్పించేవారు. అయితే, ఈ విధానంలో కొన్ని ఏరియాల్లోనే సీట్లు నిండి పలువురికి నిరాశ ఎదురవుతోంది. ఇంకొన్ని ఏరియాల్లో సీట్లే నిండడం లేదు.

తెరపైకి కౌన్సెలింగ్

ఏరియాల వారీగా ఖాళీలు, సీట్ల భర్తీని పరిగణనలోకి తీసుకున్న అధికారులు ఈ ఏడాది కౌన్సెలింగ్ విధానాన్ని మొదలుపెట్టారు. ఖాళీలు, ప్రతిభ ఆధారంగా ఒక్కో ఏరియాలోసీట్లు భర్తీ చేస్తూ మిగిలిన వారికి ఇతర ఏరియాలకు కేటాయిస్తున్నారు. ఇప్పటికే ఒకదశ కౌన్సెలింగ్ పూర్తి కాగా, రెండో విడత జరగాల్సి ఉంది. అయితే, ఈ విధానంలో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. అప్రెంటిస్ కాలంలో ట్రేడ్ల ఆధారంగా కొందరికి నెలకు రూ.8వేలు, ఇంకొందరికి రూ.7వేలు చెల్లిస్తున్నారు. ఇతర ఏరియాలో సీటు వస్తే ఈ నగదుతో జీవనం కష్టమవుతున్న పాత విధానాన్నే అమలుచేయాలని కోరుతున్నారు.

అలా ఇవ్వడం సాధ్యం కాదు

చాలామంది ఒకే ఏరియా కోరుతుండడంతో ఇంకొన్ని చోట్ల సీట్లు మిగులుతున్నాయి. అందుకే కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా కేటాయిస్తున్నాం. ఏమైనా మార్పులు చేయాలంటే ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

– సయ్యద్ హబీబ్ హుస్సేన్, జీఎం (హెచ్ఆర్‌డీ)

ఎక్కడి వారికి అక్కడే అవకాశం ఇవ్వాలి

నిరుద్యోగులకు శిక్షణ ఒక వరం లాంటిది. కానీ యాజమాన్యం ఇతర ఏరియాల్లో కేటాయిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు. కొందరు కార్మికులు సైతం ఉద్యోగాలకు సెలవు పెట్టి పిల్లలతో ఉండాల్సి వస్తున్నందున ఎక్కడి వారికి సీట్లు కేటాయించాలి.

– ఎం.డీ.రజాక్, ఏరియా ఉపాధ్యక్షుడు

తునికాకు టెండర్లు ఇంకెప్పుడు?

- పొరుగు రాష్ట్రాల్లో ఇప్పటికే ఖరారు
- ఆలస్యమైతే నష్టపోనున్న కూలీలు
- గతేడాదీ టెండర్లలో ఆలస్యం



తునికాకు

పాల్వంచరూరల్: తునికాకు సేకరణకు టెండర్లలో జాప్యం జరుగుతుండడంతో ఇటు కూలీలకు ఉపాధి, అటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడాది సైతం ఇదే పరిస్థితి ఎదురైనా అధికారులు మేల్కొనకపోవడం విమర్శలకు తావిస్తోంది. వేసవి పంటగా గిరిజన, గిరిజనేతర కూలీలు పిలుచుకునే తునికాకు సేకరణ కోసం ఎదురుచూస్తుంటారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తునికాకు సేకరణ ద్వారా వేలాది మంది కూలీలు అంతోఇంతో సంపాదించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

గతేడాదీ ఆలస్యమే...

భద్రాద్రి జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో గతేడాది 33,300 స్టాండర్డ్ బ్యాగ్‌ల తునికాకు సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం గతేడాది 39 యూనిట్లు ఏర్పాటుచేసి తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన జనవరి 27వ తేదీనే టెండర్ జారీ చేశారు. ఫిబ్రవరి 7నుంచి 14వ తేదీ వరకు, మార్చిలో రెండు, మూడో విడతగా టెండర్లు నిర్వహించారు. టెండర్ జారీనే ఆలస్యం కావడం.. ఆపై స్పందన లేక మూడు విడతలుగా టెండర్లు నిర్వహించినా ఫలితం లేక 33,300 స్టాండర్ బ్యాగ్‌ల లక్ష్యానికి 13,478 స్టాండర్డ్ బ్యాగ్‌ల(41.7శాతం) సేకరణే జరిగింది. అయినప్పటికీ ఈ ఏడాది సైతం అధికారులు ముందడుగు వేయకపోవడం గమనార్హం.

పొరుగు రాష్ట్రాల్లో ఇప్పటికే పూర్తి..

పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో తునికాకు టెండర్లు పిలిచారు. తెలంగాణలో మాత్రం కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే తెలంగాణకు చెందిన తునికాకు కాంట్రాక్టర్లు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి అక్కడ టెండర్లలో పాల్గొంటున్నారు. మన రాష్ట్రంలో మరింత జాప్యం జరిగే ఇటువైపు వచ్చే పరిస్థితి ఉండదు. గతేడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా తునికాకు యూనిట్లు అమ్ముడుపోక నష్టం వచ్చినందున.. వీలైనంత త్వరగా అధికారులు స్పందిస్తేనే కూలీలకు ఉపాధి, అటవీశాఖకు ఆదాయం లభిస్తుందని గిరిజన సంఘాల నాయకులు చెబుతున్నారు.

సకాలంలో ప్రూనింగ్ చేస్తేనే...

టెండర్ల ప్రక్రియ పూర్తయితేనే కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ చేసుకుని మార్చిలో తునికాకు మొడం కొట్టడం(ఆకు ప్రూనింగ్) మొదలుపెడితే ఆకు సకాలంలో చిగురిస్తుంది. ఆపై సేకరణతో ఫలితం ఉంటుంది. ప్రూనింగ్ ఆలస్యమైతే ఆకు చిగురించక లక్ష్యం నెరవేరకపోగా కూలీలకూ గిట్టుబాటు కాదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను వివరణ కోరగా.. తునికాకు టెండర్ల నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతుందని తెలిపారు. ఇటీవల జరిగిన అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించామని వెల్లడించారు.